# అపార్ట్‌మెంట్ జీవులు

## వి.లక్ష్మి సుజాత

**మధ్యాహ్నం మూడున్నరవుతోంది. సుమతి టి.వి ఆఫ్ చేసి తలుపు గడియవేసి ఎదురు ఫ్లాట్‌లోకి నడిచింది. సావిత్రి ఎంబ్రాయిడరీ చేస్తోంది. తలతిప్పి చూసి ''రా'' అంది.**

''మళ్ళీ ఇంకోటి మొదలు పెట్టావా ఏంటీ. ఎంత ఓపికే బాబూ నీకు'' సుమతి ఆశ్చర్యం పడిపోతూ సోఫాలో కూలబడింది.

''ఏదో ఒకటి చెయ్యకుండా ఖాళీగా ఎంత సేపు టీవీ చూస్తాం'' సావిత్రి అంటుండగా మెట్లమీద చప్పుడైంది. ఆటోమాటిగ్గా ఇద్దరి తలలూ అటు కేసి తిరిగాయి. వీళ్ళిద్దరికీ పక్క ఫ్లాట్‌లో వుండే మేరియా, శనివారం కావడంతో పెందలాడే ఇంటికి వచ్చినట్టుంది ఆఫీసు నుండి. మేరియా కనబడగానే సావిత్రి గొంతు పెంచింది. ''ఏం చేస్తాం? మనకే వన్నా ఉజ్జోగాలా, సజ్జోగాలా ఊరి మీద బడి తిరగ డానికి! ఏదో సంసారపక్షంగా కొంపలో ఏడ్చేవాళ్ళం గాబట్టి, తోచుబాటుకి కుట్లూ, అల్లికలూ! అన్నట్టు ఇవాళ జెమినీ టీవీలో సతీ లీలావతి సిన్మా రాత్రికి.''

మేరియా ఒక్క క్షణం ఆగి వీళ్ళిద్దరి వైపు ఛీత్కారంగా చూసి ''థూ'' అని తన ఫ్లాట్‌లోకి వెళ్ళి పోయింది.

''హమ్మ హమ్మ దీనికెంత బలిసిందే, కిరస్తానీ ముండ'' సుమతి అక్కసుగా అంది.

''అసలు దీన్ని ఈ అపార్టుమెంట్లోంచి పంపిద్దా మంటే కుదరట్లేదే. ఇదొక్కటే కిరస్తానీది! దీనికి ట్రాన్స్‌ఫర్లూ అయ్యా ఏం రావేమో.''

''సడేలే సంబడం! అద్దెకున్న దాన్ని ఖాళీ చేయించవచ్చుగానీ సొంత కొంపలోంచి ఎట్లా పంపి స్తాం? మన ఖర్మ ఇట్లా కాలిందని సర్దుకోవడమే.''

పోస్టుమాన్ మెట్లెక్కి వచ్చాడు ఆయాసప డుతూ!

''తల్లీ, మీరంతా కలిసో, కలవకో ఒక లెటర్ బాక్స్ గేటుకు పెట్టించుకోకపోతే, ఇహనించి నేను లెటర్స్ గేట్లో ఇరికించేసి పోతా! నా వల్లగాదు మెట్లె క్కడం'' సుమతికి కవరు అందించాడు. అదెక్కడి నుండి వచ్చిందో కూడా సుమతి పట్టించుకోలేదు. ''ఆ గులాబీ పూల కవరెవరికీ, బలే బాగుంది'' అంది కాజువల్‌గా అన్నట్టు.

''అది మేరియా గారిది లెండి'' అంటుండగానే ధడాలున మేరియా తలుపు తీసి వాట్ నాన్సెన్స్ యు ఆర్ డూయింగ్ పోస్ట్‌మాన్? యూ ఆర్ షోయింగ్ మై లెటర్స్ టు దట్ బ్లడీ ఉమన్'' అని కవరు లాగే సుకుంది.

నోరు పారేసుకోవడం మేరియాకి ఫారెక్స్‌తోనో, సెరిలాక్‌తోనో పెట్టిన విద్య!

''ఒళ్ళు దగ్గరుంచుకుని మాట్లాడు! నీ పేరె త్తానా, ఊరెత్తానా'' సుమతికి ఒళ్ళు మండిపో యింది.

''యూ షటప్! నేనూ నీ పేరెత్తలేదు. అయినా పరాయివాళ్ళ ఉత్తరాలు చూడ్డానికి సిగ్గుండక్క ర్లా?'' ఇంకో మాటకి ఛాన్స్ ఇవ్వకుండా తలుపు గబాలున మూసేసింది మేరియా. పోస్టుమాన్ ఎప్పుడో పారిపోయాడు!

''దీనికింత ఎక్కువై పోయిందేమిటసలు'' మండిపడిపోయింది సావిత్రి. డయానా అపార్టుమెం ట్స్‌లో ఉండే వాళ్ళందరూ తమని తాము ఒక ప్రత్యే కమైన కేటగిరీకి చెందిన వాళ్ళుగా భావించేసుకుం టుంటారు. కానీ, వాళ్ళకు తెలియనిది ఏమిటంటే నూటికి తొంభై మంది మనుషుల మెంటాలిటీ అలాంటిదేనని!

సుమతి భర్త రామారావు, మేరియా భర్త విక్టర్ ఒకటే డిపార్టుమెంటులో ఉన్నారు. ఒకే సెక్షన్ కూడా! భార్యల మధ్య ఈ యుద్ధ వాతావరణాన్ని నివారించి ఎలా శాంతి నెలకొల్పాలో అర్థంకాక జుట్టు ఇంట్లోనూ, ఆఫీసులోనూ పీక్కుని పీక్కుని ఇద్దరికీ బట్ట తలలొచ్చేశాయి.

ఇంటికొచ్చాక ఏ బాల్కనీలోనో నిలబడి మాట్లాడుకుంటుంటే సుమతి గావుకేక పెడుతుంది ''యావండోయ్, రాహుల్ చేత హోమ్ వర్క్ చేయించుకుని చెప్తే, పనికిమాలిన కబుర్లు చెబుతు న్నావేం తీరిగ్గా'' అని. ఈలోపు మేరియా అరవనే అరుస్తుంది. ''విక్కీ, ఐ టోల్డ్ యు టు చెక్ మై ఇన్‌కమ్ టాక్స్ పేపర్స్! ధట్ డూ ఇన్ ద మార్నింగ్! వేరార్ యూ'' ఈ రెండు కేకల్తో ఇద్దరూ పాత తెలుగు సినిమాల్లోలాగా క్షణాల్లో మాయమై ఎవరి ళ్ళల్లో వాళ్ళుంటారు.

ఫ్లాట్స్ అన్నింటిలోనూ, అందరిలోనూ మేరియా దొకదారి! అందరిదీ ఒకదారి.

''ఇల్లు కడిగినప్పుడు, నీళ్ళు కామన్ ఏరియా లోకి నెట్టి వదిలేస్తావేం! మెట్ల మీదుగా కిందిదాకా పోతున్నాయి. ఎవరైనా జారిపడరూ'' అందొకసారి సావిత్రి.

''అందరి సంగతీ నీకెందుకు? నువ్వు పడ్డ ప్పుడు చెప్పు! లేదా తడి ఆరేదాకా మెట్లు దిగ మాకు'' అంది మేరియా!

మేరియా తరచూ ఎండు చేపలు వేయించి అన్ని ఫ్లాట్స్‌నీ అదరగొట్టేస్తూ ఉంటుంది.

''నువ్వు ఏమైనా వండుకో! ఎండు చేపలు రోజూ వేయిస్తావేం! కంపుతో ఛస్తున్నాం'' అంది సుమతి.

''నా ఇష్టం వచ్చిన డిషెస్ నేన్చేస్తాను. నువ్వు పొద్దున్నే మిల్క్ బాయిలర్ పెడతావు. దాని విజి లంటే నాకెంత ఎలర్జీయో! అయినా నువ్వు మానా వా! నేను చేపలు వేయించుకునేప్పుడు ఈసారి ముందుగా చెప్తాన్లే! అలా టాంక్‌బండ్‌కెళ్ళి సరదాగా తిరిగి రండి! అక్కడ ఇంకా కమ్మని స్మెల్లు 'వస్తుం ది' అంది మేరియా.

మేరియా ఎంత చదువుకున్నా, తగాదా వస్తే పచ్చిబూతులు మాట్లాడుతుంది. అందుకే తెల్సీ ఎవరూ మేరియాతో పెట్టుకోరు గానీ సావిత్రీ, సుమతీ, మేరియా పక్క ఫ్లాట్స్ వాళ్ళే కావడం వల్ల, మేరియా వల్ల ఇబ్బందులు కలిగినప్పుడల్లా మందలించబోయి ఒకటికి పది తింటారు. మేరియా ఉద్యోగం చేస్తోంది కాబట్టి మగాళ్ళతో తిరుగుతోందని కథలల్లి ప్రచారంచేసి తృప్తిపడతారు ఇద్దరూ! వీళ్ళిద్దరినీ పూచిక పుల్ల కింద తీసి పారే స్తుంది మేరియా!

వచ్చే విభేదాలు చిన్నవే అయినా వాటిని పెద్దవి



చేసి రాద్ధాంతాలు సృష్టించడంలో ముగ్గురూ సిద్ధహస్తులే!

''పిల్లలేరీ'' అడిగింది సుమతి.

''మీ వాడూ మా వాడూ కలిసి కింద ఆడుకుంటున్నారు. శాంతి నిద్ర పోతోంది'' చెప్పింది సావిత్రి.

అంతలో కిందనుండి ఓ మోస్తరు బూతులు, సావిత్రి కొడుకు బబ్లూ ఏడుపూ, రాహుల్ అనగా సుమతి పుత్రుడి కేకలూ వినబడ్డంతో ఇద్దరూ లేచి కిందికి పరిగెత్తారు.

బబ్లూ, రాహుల్, బ్లెస్సింగ్‌టన్ ఉన్నారక్కడ. బ్లెస్సింగ్‌టన్ మేరియా కొడుకు.

''ఏమైంది బబ్లూ, బ్లెస్సీ కొట్టాడా'' ఏం చెప్పాలో కొడుక్కి క్లూ ఇచ్చేస్తూ వాడి దగ్గరికి పరిగెత్తింది సావిత్రి.


''కాదాంటీ, బబ్లూయే బ్లెస్సీని కొట్టాడు ముందు.'' రాహుల్ ముందు కొట్టాడు.

''ముందా? అంటే బ్లెస్సీ కూడా కొట్టాడా మళ్ళీ.''

''కాదు మమ్మీ, వాడు నా బాట్ కావాలంటున్నాడు, నేనెందుకివ్వాలీ'' బబ్లూ గొంతు పెంచాడు.

''బబ్లూ నా బాట్ విరగ్గొట్టాడాంటీ, కావాలంటే చూసుకోండి'' పగులుబారి చీలటానికి సిద్ధంగా ఉన్న తన బాట్‌ని చూపించాడు బ్లెస్సీ.

''అయితే? వాడి బాట్ లాక్కుంటావా నువ్వు? అసలు వాడు విరక్కొట్టాడో లేదో? నువ్వే విరక్కొట్టుకున్నావు? అవున్నువ్వే'' గయ్యిమంది




సావిత్రి.

''కాదాంటీ, బబ్లూయే విరగ్గొట్టాడు? నే చూశానుగా! మాథ్స్ (మేథమేటిక్స్) హెచ్.డబ్ల్యు (హోంవర్క్) చూపించలేదని బబ్లూయే బ్లెస్సీ బాట్‌ని గోడకేసి కొట్టాడు. బ్లెస్సీనేమో బబ్లూని తిట్టాడు. వాళ్ళమ్మతో చెప్తానన్నాడు. వెంటనే బబ్లూ బ్లెస్సీని కొట్టాడు. బ్లెస్సీ బబ్లూని కొట్టాడు. నేనిక్కడే ఉన్నానుగా! అంతా చూసేందుకు'' ఐ విట్‌నెస్ రాహుల్ గబగబా అంతా చెప్పేశాడు.

''నువ్వు నోర్ముయ్యి! వాళ్ళిద్దరూ కొట్టుకుంటే నీదేంటి మధ్యలో? డిప్పకాయవి'' అరిచింది సుమతి.

''బబ్లూ నిజమేనా? బ్లెస్సీని ఎందుకడిగావు మధ్య? రాత్రి డాడీ నీచేత హోమ్‌వర్క్ చేయించలా?'' కళ్ళెర్ర చేసింది సావిత్రి.

''డాడీకి ఆ సమ్స్ (లెక్కలు) రావంట. డాడీ టి.ఎం అంట కదా మమ్మీ. (టి.ఎం అంటే తెలుగు మీడియా) ఎవరినన్నా అడిగి చెప్పించుకోమన్నారు? నువ్వూ టి.ఎమ్మే కదా అని బ్లెస్సీని అడిగాను. బ్లెస్సీ వాళ్ళు ఇంట్లో కూడా ఇంగ్లీషులోనే టాక్ చేస్తారు.

''నోర్మూసుకో'' అటూ ఇటూ చూసింది సావిత్రి.

సుమతికి నవ్వొచ్చి, ఆపుకుంది ఎలాగో. ఇంతలో మెట్లమీద మేరియా కంఠం ఖంగుమంది.

''బ్లెస్సీ, వాట్స్ గోయింగ్ ఆన్ దేర్, యూ కమ్ హియర్ ఫస్ట్.''

''నథింగ్ మమ్మీ, యు నీడ్ నాట్ కమ్ హియర్, వియార్ జస్ట్ ప్లేయింగ్!'' అరిచాడు బ్లెస్సీ! ఇంట్లోనూ, స్కూల్లోనూ కూడా ఇంగ్లీషులోనే మాట్లాడాలని మేరియా వాడికి 'వార్నింగ్' ఇచ్చింది.

సావిత్రి గొంతు వినబడుతుండటంతో మేరియా మెట్లు దిగి కిందికి వచ్చింది ఆగలేక!

''వాట్ హేపెండ్'' ఎవర్నీ ఉద్దేశించకుండా అడిగింది.

''నథింగ్ మమ్మీ. బబ్లూ ఆస్క్‌డ్ మి టు షో మై హెచ్.డబ్ల్యు బుక్స్! బట్ ఏ డిడ్ నాట్! నౌ వియార్ ప్లేయిడ్ క్రికెట్ నౌ, హి బ్రోక్ మై బాట్ మమ్మీ'' మొత్తానికి ఇంగ్లీషులోనే వివరించాడు బ్లెస్సింగ్‌టన్.

వాడి ఇంగ్లీషులో తప్పులు వెతుకుతున్నారు. ''వాట్ బబ్లూ? ఈజిట్ ట్రూ?'' అడిగింది మేరియా!

''చాల్లే నీ ఇంగ్లీషు! ఒక పక్క పిల్లలు కొట్టుకుచస్తుంటే నీ ఇంగ్లీషొకటి మధ్యలో! బబ్లూకేం తెలీదు! మీ వాడే విరక్కొట్టుకున్నాడు'' అంది సావిత్రి.

''నాన్సెన్స్‌గా మాట్లాడకు! బబ్లూ, నువ్వు చెప్పు.''

''ఎస్ ఆంటీ, బట్ హి సెడ్ దట్ ఐ యామ్ ఎ స్టుపిడ్. మరి ఐ గాట్ యాంగ్రీ, అందుకని - ఐ డిడ్ ఇట్'' బబ్లూ ఇంగ్లీషులో నసిగాడు.

''అదీ సంగతి! బుద్ధులెక్కడికి పోతై? కనగానే సరిగాదు, పెంచడం తెలియాలి! చెప్పి చేయించడం రాకపోతే ట్యూషన్ పెట్టించుకోవాలి గానీ ఊరిమీద ఒదలటమే?''

''హోయబ్బో, నీకు తెల్సిందిలే పెద్ద! కొంపలో పట్టుమని పది నిమిషాలుండరు గానీ నాకు పెంచటం నేర్పుతుంది పెద్దమ్మ! పిల్లల్ని ఎలా పెంచాలో చివరికి నీ దగ్గర నేర్చుకోవాలిక నేను. హయ్యో రాత'' సావిత్రికి కోపం వచ్చింది.

''నోర్మూసుకో! నా ఇంట్లో నేను పది నిమిషాలే ఉంటానో, పది గంటలే వుంటానో, అసలుండనో నీ కనవసరం! ఎప్పుడు ఎవరితో ఉంటానో, ఎలా ఉంటానో నీకనవసరం! ఇంట్లో వుండే నంగనాచులు ఇంట్లో వాళ్ళలాగా ఉండండి! వెధవ్వాగుడొద్దు! వెధ వ్వేషాలు అసలే ఒద్దు.''

''ఊరికే చించుకోమాకు! వెధవ్వేషాలేంటి వెధవ్వేషాలు? వెధవ్వేషాలు ఎవరివో మీ ఆయనకి ప్రమోషన్ వచ్చినప్పుడే తెలిసిందిలే' ఆ సందర్భంలో ఆ సంగతి గుర్తొచ్చినందుకు తన్ను తాను అభినందించుకుంది సావిత్రి. విక్టర్ బాస్‌తో మేరియా రాసుకుని తిరగడం వల్లే విక్టర్‌కి ప్రమోషన్ వచ్చిందని సుమతి సావిత్రితో చెప్పిందొకసారి. రామారావుకి ప్రమోషన్ రాలేదు విక్టర్‌తో పాటుగా!

మేరియా మండిపడిపోయింది. గొంతు ఒక్కసారిగా పెంచేసింది.

''ఆ! అవునే, నేను నా మొగుడి బాస్ దగ్గరికి పోతేనే ప్రమోషన్ వచ్చింది మా ఆయనకు! నువ్వు ఎవరి దగ్గరికిపోతే నీ మొగుడికి ప్రమోషన్ వస్తుందో చెప్తాను రా! పోనీ మా ఆయన దగ్గర పడుకో! నేను రికమెండ్ చేయిస్తాను.''

''సుమతికి దడపట్టుకుంది. తన పేరు బయటికి వస్తుందేమోనని'' సావిత్రి నిలువు గుడ్లు? పడ్డాయి. వెంటనే తేరుకుంది.

''నోరు పిచ్చిగా వాగావంటే మర్యాదగా వుండదు మేరియా! నన్నేంటో అనుకుంటున్నావు! నా సంగతి తెలీదు నీకు! మగాళ్ళు ఇంట్లో లేరు కదాని ఇష్టం వచ్చినట్టు వాగద్దు. అసోసియేషన్‌కి నీ మీద కంప్లయింట్ ఇస్తాను! తర్వాత పోలీసులక్కూడా! యేమనుకున్నావో' అంది బెదిరింపుగా.

మేరియా గట్టిగా నవ్వింది.

''మీ మొగాళ్ళా! ఇంట్లో ఉన్నా లేకపోయినా పెద్ద తేడా లేదులే! కొడుక్కి బుద్ధి చెప్పాల్సింది పోయి కారుకూతలు కూస్తే ఊరుకుంటాననుకున్నావా! సరే పద అసోసియేషన్ మీటింగ్ పెడదాం సాయంత్రం! పోలీస్టేషన్‌కైతే ఇప్పుడే పోదాం పదా! ఎస్సై ఎవరనుకున్నావు మా అంకులే! పద పోదాం! ఎవరి మీద ఎవరు కంప్లయింట్ ఇవ్వాలో అక్కడే తేలుద్దాం పద'' సిద్ధమైపోయింది అప్పటికప్పుడే!

ఆ మాటతో సావిత్రి జంకింది. అయినా తొణక్కుండా ''నా పిచ్చిగానీ నీకు పోలీసు స్టేషన్‌లో మాత్రం ఏకౌంటుండదా ఏంటే'' అంది.

''ఆ వెధవ్వాగుడే నాకు తిక్క రేకెత్తించేది! నాకు మండిందంటే ఈ ఫ్లాట్స్‌లో వాళ్ళందరినీ ఒక్క రోజులో వెకేట్ చేయిస్తా! నాతో పెట్టుకుంటే ఎవరైనా సరే మటాషే!''

''ఆహా! పెద్ద విక్టోరియా మహారాణి బయల్దేరింది! ఇంత మందినీ వెళ్ళగొడదామనే? పోనీ పోనీ అని ఊర్కుంటే మరీ పేట్రేగి పోతున్నావ్! రోజుకి పది మంది మొగాళ్ళు వచ్చిపోయే కొంప నీది! ఇదేవన్నా సంసార్లుండే కొంపనుకున్నావా ఇంకేదైనా బజారనుకున్నావా! ఈ ఒక్క కారణం చాలు నిన్ను సాగనంపటానికి.''


''అవునే, వస్తారు! పది మంది కాదు పాతిక మంది వస్తారు! దానికి మీ అందరికీ సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన ఖర్మ నాకేంటి? మీరెవరసలు అడగటానికి! నేనేవన్నా నీ డర్టీ హౌస్‌లో అద్దెకుంటున్నానా! ఇది నా సొంతిల్లు! కష్టపడి కొనుక్కున్న ఇల్లు.''

''అవున్లే 'కష్టపడే' వుంటావు! ఏ జన్మలో ఏం పాపం చేసి చచ్చానో ఈ జన్మలో ఇంట్లాంటి పొరుగు దొరికింది'' వేదాంతం మాట్లాడింది సావిత్రి.

''ఏ జన్మో ఎందుకు! ఈ జన్మలో సరిగ్గా ఏడువు! వచ్చే జన్మలో నన్నా మంచి పొరుగు దొరుకుద్ది!'' ఇంతలావు డీసెంట్ ఉమన్‌కి ఎట్లాంటి పొరుగు కావాలో పాపం! నన్ను గెంటడానికి కారణాలు వెతుకుతున్నావా సతీ సావిత్రీ! మీరిద్దరూ ఏమీ ఎగరనట్టు పతివ్రతల్లాగా మాట్లాడతారేం! ఏ సేల్స్ ప్రమోటరో, ఎగ్జిక్యూటివో వస్తే లోపలికి లాక్కెళ్ళి గంటల తరబడి బేరాలాడతారుగా! అక్కడ కొనేదీ లేదు, చచ్చేదీ లేదు గాని అంతంత సేపు ఏం చేస్తారేం లోపల? అయినా ఇలాంటి చచ్చు కారణాలెందుకు? కులం పేరుతో తిట్టానని ఒక్క - కంప్లయింట్ ఇస్తే చాలు, లాకప్పు, పైకప్పు తిరిగ్గా చూడమ్మ! మాటలు మీకే కాదు, మీ కంటే ఎక్కువే వొచ్చు నాకు'' మేరియా గొంతు ఖంగుమని అన్ని ఫ్లాట్స్‌లోకీ వినబడుతోంది. బయటికొచ్చి చూస్తే మేరియా బూతులు తిడుతుందేమోనని ఎవరూ రాలేదుగానీ, చచ్చేంత టెన్షన్‌గా ఉంది అందరికీ!

''తగాదా మా ఇద్దరికి! మధ్యలో మీరిద్దరూ మీరిద్దరూ అని నన్ను లాగుతావేమిటీ, ఇదేం సరదా నీకు'' సుమతి కోపంగా చూసింది మేరియాకేసి.

''సరదా నాక్కాదు! నీకే దురద! నేనెవరెవరి తోనో తిరుగుతేనే, నాకూ మా ఆయనకీ ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు వొచ్చాయని ఈ ఫ్లాట్స్‌లో ఫ్రీ క్యాన్వాసింగ్ చేసింది నువ్వేనని వాచ్‌మన్‌తో సహా అందరికీ తెల్సులే గానీ నోరు కొంచెం కట్టిపెట్టు''




వెటకారంగా అంది మేరియా!

''సుమతికి మాట పడిపోయింది.

''పిల్లల్ని కాస్త చదువుకోమని చెప్పుకోండి! పొద్దుగూకులూ మా వాడి పుస్తకాల్లో చూసి రాస్తే ఎప్పటికొస్తుంది. పైగా చూపించలేదని వాడి బాట్ విరక్కొడతాడా! ఈసారి ఇలాంటి సీన్ నా కళ్ళ పడిందంటే మీదాకా వచ్చే ప్రశ్నేలేదు. లెంపలు వాయిస్తాను.''

''ఆ, వాయిస్తావు బాగా! అంది చచ్చు మొహాలు ఇక్కడెవరూ లేరు చూస్తూ కూర్చోడానికి! బబ్లూ నువ్వింట్లోకి రా'' ఒక్క కేక పెట్టింది సావిత్రి.

''బ్లెస్సీ! కమిన్‌సైడ్, ఐ విల్ కంప్లెయింట్ టు యువర్ డాడి టుడే! యు ఆర్ నాటెటాల్ రీజనింగ్ టు మి.''

సావిత్రీ మేరియాలు చుట్టూ చూశారు. అక్కడ పిల్లలు లేరు. ఇద్దరూ గబగబా గేటు దగ్గిరికి వచ్చారు. అక్కడ ఎదురుగా కనబడ్డ దృశ్యం చూసి ఏం మాట్లాడాలో తోచక అలాగే నిలబడ్డారు.

కొత్తగా కడుతున్న బిల్డింగ్ ముందు ఇసుక కుప్పలో బ్లెస్సీ, బబ్లూ ఒకళ్ళమీద ఒకళ్ళు కాళ్ళూ, చేతులూ వేసుకుని పడుకుని మాట్లాడుకుంటున్నారు.

వీరిద్దరికి పైపైపు నుంచుని విరిగిన బాట్‌ని ఫెవికాల్‌తో బాగు చేస్తున్నారు సుమతి కొడుకు రాహుల్!

''పోనీరా బ్లెస్సీ! రోజూ నీ చేత మాథ్స్ చెప్పించుకుంటాన్లే! ఐ వోంట్ ఆస్క్ యూ టు షో యువర్ హెచ్.డబ్ల్యూ. నీ బాట్ బాగు చేసుకుని నేనుంచుకుంటాను. నా బాట్ నువ్వు తీసేస్కో. మా మమ్మీకి నేను చెప్తాన్లే! బ్లెస్సీ నిజంగా మీరు మా ఇంట్లోంచి వెళ్ళిపోతారా'' అంటున్నాడు బబ్లూ.

''పోంరా! ఎందుకు పోతాం'' బ్లెస్సీకి అర్థం కాలేదు ఎందుకు పోవాలో.

''మమ్మీ వాళ్ళు దెబ్బలాడుకుంటున్నారుగా మరి.''

''అదా? ఆడుకుంటే? వాళ్ళెప్పుడూ దెబ్బలాడుకుంటారుగా! మరి మేం వెళ్ళిపోయామా ఏంటి? నీ బాట్ నీ దగ్గరే ఉండనీలే! ఆడుకునేప్పుడు కలిసి ఆడుకుందాం! నా బాట్ రాహుల్ బాగు చేస్తున్నాడుగా.''

రాహుల్ బాట్‌ని ఎండలో పెట్టి ''ఒరేయ్ మనం దెబ్బలాడు కోవద్దు రా బ్లెస్సీగా! మమ్మీ వాళ్ళ కొట్లాట ఇంకా అయినట్టులేదు. మనం ఫ్రెండ్లీగా ఉంటే వాళ్ళు దెబ్బలాడుకోరేమో'' అన్నాడు.

సావిత్రి, మేరియాల మనసుల్లో చెప్పలేని భావమేదో కదిలింది. పిల్లల ముందు ఎంతగా దిగజారిపోయారో కళ్ళకు కట్టినట్టు అవగతమవుతోంటే, తమ మీద పిల్లల ఆధిపత్యాన్ని మనసు అంగీకరిస్తున్నా, సిగ్గులాంటి భావమేదో కలుగుతోన్నా, బయటికి అంగీకరించటానికి 'అహంహ' ఒప్పుకోక.

''బ్లెస్సీ కమ్'' అని, మేరియా ''బబ్లూ ఇంటికి రా'' అని సావిత్రీ గబగబా మెట్లెక్కి ఎవరింట్లోకి వాళ్ళు వెళ్ళి తలుపులు ధడాలున మూసుకున్నారు.

వాళ్ళ పిలుపులు పిల్లలకి వినబడనే లేదు.